సాక్షి గుంటూరు

గురువారం । 20 । మార్చి । 2025



నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి బుధవారం గుంటూరు గోరంట్లకు చెందిన వాసా భాస్కరరావు రూ.లక్ష విరాళం సమర్పించారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ



కొరిటెపాడు : భారత పొగాకు బోర్డు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జి.విశ్వశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది, పలువురు వ్యాపారులు, రైతులు కలిసి అభినందనలు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
గుంటూరు	6.24	4.55
నరసరావుపేట	6.26	4.57
బాపట్ల	6.24	4.55

మూల్యాంకనం వేగవంతం

- సబ్జెక్టులవారీగా ఇంటర్ వాల్యుయేషన్
- వాల్యుయేషన్ కేంద్రాల్లోనే మార్క్స్ ట్యాబ్లేషన్
- 70శాతం మంది అధ్యాపకులు విధులకు హాజరు
- పర్యవేక్షిస్తున్న ఆర్ఐఓ జుబేర్



గుంటూరులో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ జరుగుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ వేగవంతమైంది. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో అధ్యాపకులు విధుల్లో నిమగ్నమై ఉన్నారు. గుంటూరు జిల్లాకు ఆర్ట్స్, సైన్స్ కోర్సుల వారీగా 3.30 లక్షలు, ఒకేషనల్‌కు సంబంధించినవి 60వేల స్క్రిప్టులు వచ్చాయి. స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు అధికారి, ఆర్ఐవో జీకే జుబేర్ పర్యవేక్షణలో ఈనెల 17 నుంచి జవాబు పత్రాలను అధ్యాపకులు మూల్యాంకనం చేస్తున్నారు.

సబ్జెక్టుల వారీగా వాల్యుయేషన్

స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో సబ్జెక్టుల వారీగా ఏర్పాటు చేసిన బోర్డులలో అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. తెలుగు–రెండు, ఇంగ్లీషు–19, హిందీ–ఒకటి, సంస్కృతం–15, మాథ్స్–31, సివిక్స్ రెండు చొప్పున బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతి బోర్డులో ఒక చీఫ్ ఎగ్జామినర్‌తో పాటు ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఉంటారు. వీరికి అదనంగా బోర్డుకు ఒకరు చొప్పున నియమించిన స్క్రూటినైజర్ మూల్యాంకనం చేసిన ఆన్సర్ స్క్రిప్టులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, కేటాయించిన మార్కులను పరిశీలిస్తారు. ఈ విధంగా 420 మంది అధ్యాపకులతో పాటు స్క్రూటినైజర్లుగా మరో 70 మంది అధ్యాపకులు విధుల్లో ఉన్నారు. కాగా 2వ స్పెల్‌లో మిగిలిన సబ్జెక్టులకు గురువారం నుంచి మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే ఒకేషనల్ పేపర్ల వాల్యుయేషన్ కోసం ఏర్పాటు చేసిన ఆరు క్యాంపులలో ఒకటిగా గుంటూరులో కొనసాగుతుండడం గమనార్హం.



ఆన్సర్ స్క్రిప్టుల స్కానింగ్ (ఫైల్)

అధ్యాపకులను రిలీవ్ చేసి వాల్యుయేషన్‌కు పంపాలి



జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల నుంచి స్పాట్ వాల్యుయేషన్ విధులకు నియమించిన అధ్యాపకుల్లో 70 శాతం మంది హాజరవుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జవాబు పత్రాలను వేగంగా మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులందరూ రావాలి. వారిని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తక్షణమే రిలీవ్ చేసి వాల్యుయేషన్ కేంద్రానికి పంపాలి. లేకుంటే శాఖాపరమైన చర్యలతోపాటు జరిమానా విధిస్తాం.

– జీకే జుబేర్, ఇంటర్‌విద్య ఆర్ఐవో, గుంటూరు

వాల్యుయేషన్‌తో పాటు "మార్క్స ట్యాబ్లేషన్"

గతంలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను చీఫ్ ఎగ్జామినర్లు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మార్కులు వేసి ఇంటర్మీడియెట్‌బోర్డుకు పంపేవారు. బోర్డులో జవాబు పత్రాలు స్కాన్ చేసి విద్యార్థుల రోల్ నంబరు, ప్రశ్నపత్రంతో ఇచ్చిన సీరియల్ నంబరు, బార్ కోడ్ ఆధారంగా మార్కులు కేటాయించి ట్యాబ్లేషన్ చేసేవారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల మార్క్స్ ట్యాబ్లేషన్ ఇంటర్ బోర్డు అధికారులకు తలకుమించిన భారంగా మారడంతో తీవ్ర జాప్యమయ్యేది. ఈ ప్రభావం ఫలితాల వెల్లడిపై పడేది. ఈ నేపథ్యంలో గతేడాది ఈ విధానంలో మార్పులు తెచ్చిన అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాల వారీగా స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లోనే మార్క్స్ ట్యాబ్లేషన్‌కు ఏర్పాట్లు చేసింది. ఇక్కడే మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను స్కాన్‌చేసి బోర్డుకు పంపుతున్నారు. దీనివల్ల ఇంటర్‌బోర్డుకు భారం తగ్గింది. ఫలితాలు త్వరగా వెల్లడించేందుకు ఆస్కారం ఏర్పడింది.

మేయర్ పీఠాన్ని వదులుకోకూడదు



పార్టీ కార్పొరేటర్లతో సమావేశమైన అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి, నూరిఫాతిమా, వజ్రబాబు తదితరులు

- భవిష్యత్ కార్యాచరణపై వైఎస్సార్ సీపీ సమావేశం
- పార్టీ కార్పొరేటర్లతో జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు భేటీ
- హాజరైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డెప్యూటీ మేయర్ వజ్రబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, నూరిఫాతిమా

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు మేయర్ పదవి విషయంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్లాలని, ఎట్టిపరిస్థితిలో మేయర్ పీఠాన్ని వదులుకోకూడదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు రాజీనామా చేసిన అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై.. అత్యవసర కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు వ్యవహరించాల్సిన తీరుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబుతో కలిసి అంబటి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేయర్ కావటి మనోహర్‌నాయుడు హాజరుకాలేదు. అంబటి మాట్లాడుతూ మేయర్ పదవి విషయంలో గట్టిగా వ్యవహరించాలని సూచించారు. సమావేశం వాయిదా పడినందున మళ్లీ జరిగే సమావేశానికి ముందు రోజున సమావేశమై కార్యాచరణ రూపొందిద్దామన్నారు. కూటమికి మేయర్ పదవి దక్కకుండా ఏం చేయడానికైనా పార్టీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మరింత బలంగా నిలబడి ప్రజల గొంతుకగా కౌన్సిల్‌లో ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

1,27,005 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,27,005 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,24,077 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 66,903 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

న్యూస్‌రీల్

26లోపు రీ సర్వే పూర్తిచేయాలి



పొన్నూరు: పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన వల్లభరావుపాలెంలో ఈనెల 26 లోపు ప్రభుత్వ భూములు, నివాసాల రీసర్వే పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ చెప్పారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన తనిఖీ చేసి భూ రికార్డులు పరిశీలించారు. 5.24 సెంట్లు విస్తీర్ణంలోని చెరువు సరిహద్దులు, 7.63 సెంట్ల విస్తీర్ణంలోని తోక పోలాలను రోవర్ల ద్వారా తిరిగి నిర్ధారించే క్రమాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రీసర్వే బృందాలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ల రోజువారి పని తీరును పరిశీలించి సర్వే త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ మహ్మద్ జియావుల్‌హక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి సర్వే ఇన్‌స్పెక్టర్ పి.పార్థసారధి, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మందులతో క్షయ వ్యాధి నివారణ

టీబీ విభాగ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్



తెనాలిఅర్బన్: మందులు సకాలంలో వాడితే క్షయను పూర్తిగా నివారించవచ్చని టీబీ విభాగ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ పేర్కొన్నారు. తెనాలి పట్టణ పరిధిలోని రోగుల ఇళ్లకు బుధవారం ఆయన వెళ్ళి వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే వారు వాడే మందుల వివరాలు సక్రమంగా రికార్డు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందులు ఒక్కరోజు వాడకపోయినా చాలా ప్రమాదమని చెప్పారు. ఆయన వెంట టీబీ తెనాలి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, ఎం.లక్ష్మి, హెల్త్ విజిటర్స్ వి.వి.దిలీప్ కుమార్, కె.భార్గవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి వచ్చినా జీతం రాదట..!

తప్పుల తడకగా ఏఎన్ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఉద్యోగోన్నతి వచ్చినా జీతం రాదని తెలిసి పలువురు ఏఎన్ఎంలు లబోదిబోమంటున్నారు. అధికారులు చేసిన తప్పులకు తాము బలి అవుతున్నామని విలపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 266 గ్రేడ్–3 ఏఎన్ఎంలకు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్‌గా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ కౌన్సెలింగ్‌లో 15 మంది ఏఎన్ఎంలకు పొజిషన్ ఐడీ లేని ప్రాంతాల్లో అధికారులు పోస్టింగ్ ఇచ్చారు. కొన్ని ప్రాంతాల్లో శాంక్షన్ పోస్టు ఉన్నా.. పొజిషన్ ఐడీ లేకపోతే జీతం రాదు. ఈ విషయాన్ని కౌన్సెలింగ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గమనించలేదు. ఖాళీల ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేసినప్పుడు వాటిలో పొజిషన్ ఐడీలేని ప్రదేశాలు తీసివేసి, శాలరీ వచ్చే ప్రదేశాలు మాత్రమే చూపించాల్సి ఉంది. అయితే అవేవీ డీఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు పట్టించుకోలేదు. పొజిషన్ ఐడీ లేని ప్రాంతాల్లోనూ పోస్టింగ్ ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తీసుకుని కొత్త హోదాలో విధుల్లో చేరేందుకు కోటి ఆశలతో వెళ్లిన ఏఎన్ఎంలకు అక్కడి సిబ్బంది ఈ విషయం చెప్పారు. దీంతో లబోదిబోమంటూ 15 మంది ఏఎన్ఎంలు తిరిగి డీఎంహెచ్ఓ కార్యాలయానికి వచ్చారు. అయితే గురువారం సాయంత్రం మరోమారు కౌన్సెలింగ్ చేపట్టి మిగిలిన ఖాళీల్లో జీతం వచ్చే ప్రదేశాలు ఉంటే అక్కడ పోస్టింగ్ ఇస్తామంటూ డీఎంహెచ్ఓ అధికారులు చెప్పారు. దీంతో ఏఎన్ఎంలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్షయకు క్రమం తప్పకుండా మందులు వాడాలి

కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర: క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్త నిర్వహణలో కొల్లిపరలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. రోగులకు పోషకాహార కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షయ రోగుల కోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 2,557 మంది క్షయ రోగులు ఉన్నట్టు వెల్లడించారు. క్షయ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ కొల్లి మేఘనారెడ్డి ముందుకు రావడం ముదావహమన్నారు. కొల్లి మేఘనారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. తొలుత సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి , తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. గ్రామంలో క్షయ రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితి గురించి ఆరా తీశారు. క్షయ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డియంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి , డిసిహెచ్ఎస్ మయానా మస్తిదాబి , తహసీల్దారు సిద్దార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్, ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి బాషిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కులు, రోగులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకం

గుంటూరు వెస్ట్: జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి బ్యాంకర్ల సమీక్ష జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదంతో ముందుకు వెళుతుందని, యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంతోపాటు, ఎంఎస్ఎంఈలకు బ్యాంకర్లు వేగంగా రుణాలు అందించాలన్నారు. రైతుతోపాటు, కౌలు రైతులకు కూడా బ్యాంకర్లు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా రుణాల ప్రాసెసింగ్ అత్యంత వేగంగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా అన్ని రంగాల్లో 15 శాతం పురోగతి సాధించడానికి బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రుణ లక్ష్యాలు, సాధించిన పురోగతిని వివరించారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు డీజీఎం ఎస్.జవహర్, ఆర్‌బీఐ ఎల్డీఓ నవీన్ చిరునేని, నాబార్డు డీడీఎం ఇ.శరత్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ జరగకూడదు

కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర: టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ఇన్విజిలేటర్లపై ఉందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కొల్లిపర హైస్కూల్‌లో టెన్త్ పరీక్ష కేంద్రాన్ని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహ , తహసీల్దారు సిద్ధార్థ, ఎంపీడీఓ వి.విజయలక్ష్మితో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కేంద్రాన్ని ప్రభుత్వం సమస్యాత్మక కేంద్రంగా రికార్డుల్లో నమోదు చేయడంపై ఆరా తీశారు. మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాల అభివృద్ధికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి? ఇంకా ఎంత అవసరమవుతాయన్న వివరాలూ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంఈఓ–2 ఝూన్సీలత తదితరులు ఉన్నారు.



కొల్లిపరలో టెన్త్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

టెన్త్ హిందీ పరీక్షకు 27,491 మంది హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని 150 కేంద్రాల్లో బుధవారం జరిగిన టెన్త్ హిందీ పరీక్షకు 27,664 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 27,491 మంది హాజరయ్యారు. 21 కేంద్రాల్లో దూరవిద్య టెన్త్ పరీక్షలకు 1,039 మందికి 836 మంది హాజరైనట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు. రాష్ట్ర పరిశీలకురాలు పి.పార్వతి ఐదు పరీక్షా కేంద్రాలు, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఏడు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 60 పరీక్ష కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

అంజుమన్‌కు ధోకా

- ఎన్నికలు నిర్వహించకుండానే కమిటీ
- అధ్యక్షుడిగా నసీర్ అహ్మద్ పేరు
- పశ్చిమ ముస్లింలకు దక్కని చోటు

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు నగరంలోని అంజుమన్–ఏ– ఇస్లామియా కొత్త కమిటీకి ఎన్నికలు నిర్వహించి మైనార్టీల అభ్యున్నతి కృషి చేస్తామన్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట తప్పారు. ఎన్నికలు లేకుండానే కొత్త కమిటీని వక్ఫ్‌బోర్డు ప్రకటించేలా చక్రం తిప్పారు. కమిటీలో పశ్చిమ నియోజకవర్గ ముస్లింలకు చోటు కల్పించలేదు. ఫలితంగా ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి.

అసలేం జరిగిందంటే..

గుంటూరులోని అంజుమన్–ఏ– ఇస్లామియా సంస్థకు వందేళ్ల ఘన చరిత్ర ఉంది. పేద ముస్లింల విద్య, వైద్యంతోపాటు ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం ఈ సంస్థ ముఖ్యోద్దేశం. సంస్థకు గుంటూరు పరిసర ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు అంజుమన్ కమిటీ ఉంటుంది. ఇది వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని ముస్లింలంతా భాగస్తులే. అయితే గెలిచిన వెంటనే తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నగర ముస్లిం మత పెద్దలు, ముస్లిం సంఘాలకు తెలీకుండా కేర్ టేకర్ కమిటీ ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. అలాగే తాజాగా వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎఫ్ఏసీ) షేక్ మొహ్మద్ అలీ కొత్త కమిటీని ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా కూడా నసీర్ అహ్మద్ ఉన్నారు. సభ్యులుగా తూర్పు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అనుయాయులే ఉన్నారు. ఈ కమిటీలో సభ్యుల నియామకానికి ఆర్థిక లావాదేవీలు జరిగి ఉంటాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



అంజుమన్-ఏ-ఇస్లామియా సంస్థ భవనం

పశ్చిమ ముస్లింలకు చోటెక్కడ?

ఇదిలా ఉంటే అంజుమన్ కొత్త కమిటీలో పశ్చిమ నియోజకవర్గ ముస్లింలకు చోటు దక్కలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వక్ఫ్‌బోర్డు సీఈఓ షేక్ మొహ్మమద్ అలీపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ఇచ్చిన పేర్లతో కమిటీని ఎలా ప్రకటిస్తారంటూ ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి. ఈ కమిటీ నియామకం గురించి కనీసం పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి అయినా సమాచారం ఉందా అని ప్రశ్నిస్తున్నాయి.

పార్సిల్లో తిరిగొచ్చిన చోరీ బంగారం!

- అవాక్కైన పోలీసులు, బాధితులు
- తండ్రిని అదుపులోకి తీసుకోవడంతో భయపడి బంగారాన్ని పంపిన దొంగ
- ఎట్టకేలకు పట్టాభిపురం పోలీసులకు నిందితుడిని అప్పజెప్పిన తండ్రి
- జల్సాలకు అలవాటుపడి చోరీలు చేస్తున్నట్టు గుర్తింపు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చోరీకి గురైన బంగారం పార్సిల్లో తిరిగి రావడంతో బాధితులు, పోలీసులు అవాక్కయ్యారు. పోలీసులు తనను పసిగట్టేశారన్న భయంతో నిందితుడే బంగారాన్ని పంపినట్టు సమాచారం. గుంటూరు విద్యానగర్‌లోని సాయినివాస్ అపార్ట్‌మెంటులోని ఓ వ్యాపారి ఇంట్లో ఈనెల 7న రూ.కోటి విలువ చేసే బంగారం చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు ద్విచక్రవాహనంపై వచ్చి దర్జాగా దొంగతనం చేసి తిరిగి వెళ్లేటప్పుడు అపార్ట్‌మెంట్ వద్ద ఆడుకుంటున్న పిల్లలకు టాటా చెప్పి వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. వ్యాపారి ఇంటి గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తే ఈ చోరీ చేసి ఉంటాడని భావించి విచారణ చేపట్టారు. కాకినాడలో పెద్దమనిషిగా చలామణీ అయ్యే వ్యక్తి కొడుకే ఈ చోరీ చేసినట్టు పసిగట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ వెళ్లిన పోలీసులు నిందితుడి తండ్రిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని పార్సిల్లో బాధితులకు పంపాడు. అయితే అందులో 50 గ్రాములు తక్కువగా ఉంది. జల్సాలకు అలవాటుపడి కాకినాడ ప్రాంతంలోనూ ఇతడు చోరీలు చేసినట్టు పోలీసులు తెలుసుకున్నారు. నిందితుడి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నిందితుడిని అతని తండ్రే బుధవారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి అప్పజెప్పినట్లు తెలుస్తోంది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

గేట్‌లో జశ్వంత్ భవానీకి 6వ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్–2025 పరీక్షా ఫలితాలలో పట్టణానికి చెందిన పెంటేల జశ్వంత్ భవాని అఖిల భారత స్థాయి 6వ ర్యాంక్ సాధించాడు. జశ్వంత్ భవాని తండ్రి రాజశేఖర్ న్యాయవాదిగా పని చేస్తున్నారు. ముంబైలో 5జీ సిస్టమ్ ఇంజనీర్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి గేట్ పరీక్షలకు జశ్వంత్ సిద్ధం అయ్యాడు. అందరి అంచనాలను నిజం చేస్తూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించాడు. దేశవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మందికి పైగా పరీక్ష రాశారు. ఇందులో దాదాపు లక్ష మంది అభ్యర్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో పరీక్ష రాశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జశ్వంత్ భవాని 6వ ర్యాంక్ సాధించడం గర్వకారణమని పలువురు అభినందనలు తెలియజేశారు.

నమో.. నారసింహా

మంగళగిరి టౌన్ : పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారు రుక్మిణీ హరణము అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్య పరులుగా దొడ్డాకుల రంగారావు, సాంబశివరావు, రామమోహనరావు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన అంగలూరి శ్రీనివాసాచార్యులు వ్యవహరించారు.

నేడు గోవర్ధనోద్ధరణ అలంకారం

ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు నేడు గోవర్ధనోద్ధరణ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ రామకోటి రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమం



లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్): ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ భారం మోపడానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి చెప్పారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ షాకులు అనే పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామారావు, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్లలో అత్యాధునిక సౌకర్యాలు

ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు



తాడికొండ : రాజధాని రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్‌లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. ఎల్‌పీఎస్ జోన్‌లలో రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్‌ల వద్ద రహదారులు, డ్రెయిన్లు, రక్షిత మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, యుటిలిటి డక్ట్, అవెన్యూ ప్లాంటేషన్, తదితర పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. కార్యాచరణలో భాగంగా రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి పరిపాలనా ఆమోదం లభించిన 22 పనులకు కమిషనర్ కె.కన్నబాబు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో లెటర్ ఆఫ్ అవార్డులు(ఎల్‌ఓఏ పత్రాలు) బుధవారం అందజేశారు. ఎల్‌ఓఏ పత్రాలు అందుకున్న గుత్తేదారు సంస్థలు అమరావతిలో నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అనుసరిస్తూ నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఈఎల్‌సీఆర్ గోపాలకృష్ణారెడ్డి, సీఈ ధనుంజయ, ఎస్.శ్రీనివాసులు, సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

భార్య, ఆమె బంధువుల వల్లే నా కొడుకు మరణించాడని మృతుని తల్లి ఆరోపణ



తాడేపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 10న పురుగుల మందు తాగిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. తాడేపల్లికి చెందిన కిశోర్(32) మద్యానికి బానిసయ్యాడు. భార్య నాగేశ్వరితో తరచూ గొడవలు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో నాగేశ్వరి తల్లి, సోదరుడు వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంలో కిశోర్‌కు, వారికి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నాగేశ్వరి తల్లి, సోదరుడు కిశోర్ కళ్లల్లో కారం కొట్టి దాడి చేశారు. మనస్తాపం చెందిన కిశోర్ ఈనెల 10న పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. అయితే భార్య, అత్త, బావమరిది వల్లే తన కొడుకు మరణించాడని కిశోర్ తల్లి బుజ్జి ఆరోపిస్తున్నారు. పెళ్లికి ముందు కిశోర్‌కు వ్యసనాలు లేవని, ఇంటర్నెట్‌లో పనిచేసేవాడని, ఇటీవల ఆ ఉద్యోగం మానివేయడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని బుజ్జి వివరించారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, సర్దిచెప్పాల్సిన అత్త, బావమరిది కళ్లల్లో కారం కొట్టి దాడి చేశారని, అందుకే తన కొడుకు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని, అయినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని విమర్శించారు. బుజ్జి వాదనను నాగేశ్వరి, ఆమె బంధువులు తోసిపుచ్చారు. మద్యానికి బానిసై తనను వేధిస్తుండడంతోనే తన తల్లి, సోదరుడు వచ్చారని నాగేశ్వరి చెప్పారు. దీనిపై ఎస్ఐ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ కేసు నమోదులో ఎలాంటి రాజీ పడలేదని, కిశోర్ బంధువులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని చెప్పారు.

విద్య, ఉపాధిపై అవగాహన



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాలలో బుధవారం విద్యార్థులకు విద్య, ఉపాధి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళ, దివ్యాంగుల సంక్షేమ విభాగం ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్యకుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శిశు అభివృద్ధి విభాగం, పోషక, విస్తరణ విభాగాలు నిర్వహించిన ప్రదర్శనను ఆమె తిలకించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సూచనలు చేశారు. కార్యక్రమంలో సామాజిక విజ్ఞాన విభాగం డీన్ డాక్టర్ బి శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి, మహిళ శిశుసంక్షేమ శాఖ ప్రతినిధి గిరిజ పాల్గొన్నారు.

మార్చి 27 నుంచి ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

గుంటూరు రూరల్: మార్చి 27 నుంచి మూడు రోజులపాటు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో దక్షిణ భారతదేశ రాష్ట్రాలనుంచి రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, పాల్గొంటారని పేర్కొన్నారు.

24న ఎయిడెడ్ స్కూల్లో పోస్టుల భర్తీకి కంప్యూటర్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఎయిడెడ్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈనెల 24న నిర్దేశిత కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత టెస్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సంబంధించిన హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సమాచారాన్ని తదుపరి తెలియపరుస్తామని పేర్కొన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ
"ఇ" - ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ.టి. నెం. 70/2024-25 తేది : 19-03-2025

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్ మెంట్ ప్లాట్ ఫారం ద్వారా టెండర్ పద్ధతిన ఆర్హులైన కాంట్రాక్టు దారుల నుండి టెండర్ కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (procurement market place) నందు చూడవచ్చును.

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ 70/2024-25

మొత్తం పనుల సంఖ్య	:	12
అంచనాలు మొత్తం	:	రూ. 77,50,000/-
పని వివరములు	:	రోడ్లు, కాలువలు మరియు ఇతర పనులు
టెండరు బిడ్‌లు కనబడు తేది	:	20-03-2025 ఉ॥ 10.30 గం లకు
టెండరు బిడ్‌లను వేయుటకు ఆఖరుతేది	:	24-03-2025 సా॥ 3.00 గం॥లకు
టెండరు బిడ్‌లను తెరుచు తేది	:	24-03-2025 సా॥ 3.30 గం॥లకు

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నగరపాలక సంస్థ, గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.698/2025/ఇ1, నిట్ నెం67/జే.టి.ఓ/2024-25 తేది.19-03-2025

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ సాధారణ నిధులు క్రింద ది దిగువ ఉదహరించిన పనులకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

	మొత్తము పనులు -16 నెం.లు పని నెం. 01 నుండి 16 వరకు	అంచనా వ్యయము రూ.96.90 లక్షలు
1	టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది: ది.20-03-2025 ఉ॥గం.11.00ని ల నుండి పని నెం. 01, 02, 03, 04, 05, 08, 09, 11, 12, 13, 14, 15 & 16 లకు	
2	టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:	ది.27-03-2025 ఉ॥ గం.11.00ని ల వరకు
3	ప్రైస్ బిడ్ తెరుచు తేది :	ది.27-03-2025 మ॥గం.02.00ని లకు
	పని నెం.06, 07, & 10 వరకు:	
4	టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:	ది.03-04-2025 ఉ॥ గం.11.00ని ల వరకు
5	ప్రైస్ బిడ్ తెరుచు తేది :	ది.03-04-2025 మ॥గం.02.00ని లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

కమీషనరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

గంజాయి, మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు

ఆర్‌పీఎఫ్, జీఆర్పీ అధికారులు



రైల్వే పార్శిల్‌ను తనిఖీ చేస్తున్న జాగిలం లియో

తెనాలిరూరల్: మాదకద్రవ్యాలు, గంజాయిని నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు తెలిపారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాల రవాణాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తెనాలి రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన పోలీస్ జాగిలం 'లియో' ప్రయాణికుల లగేజి, ప్లాట్‌ఫాంలు, రైల్వే పార్సిల్ కార్యాలయం, ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లలో తనిఖీ చేసింది. ప్లాట్ ఫాంలపై కొందరి ప్రయాణికుల లగేజిని పరిశీలించడంతో గంజాయి, మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలను గుర్తించే యత్నం చేసింది. ఈ సందర్భంగా తెనాలి ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎం.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి రైళ్ల ద్వారా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలను తీసుకువస్తుండడంతో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన జాగిలాలతో తనిఖీలు చేస్తున్నామని, ఇందులో భాగంగానే తెనాలి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టినట్టు వివరించారు. గంజాయి, మాదకద్రవ్యాల గురించిన సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 14500కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో విజయవాడ ఆర్‌పీఎఫ్ డాగ్ స్క్వాడ్ ఏఎస్ఐ బి. విజయరాజు, జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పీఎస్ఎన్ మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో పెనుముప్పు

- ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకె రవికృష్ణ
- చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు



ఆకె రవికృష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మాదకద్రవ్యాలు మానవాళికి పెనుముప్పుగా పరిణమించాయని ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆకె రవికృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మత్తు, మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి స్కూల్, కాలేజీలలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేయాలని సూచించారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఎస్పీ కె.నగేష్‌బాబు, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్, కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం అతిథులను సన్మానించింది.

ముగిసిన ఏఎన్‌యూ అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నీ

విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్న ధనలక్ష్మి కాలేజీ జట్టు



విజేతల జట్టుతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక దృఢత్వం సిద్ధిస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్ (మెన్) టోర్నమెంట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటాపోటీగా సాగిన టోర్నమెంట్‌లో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎమ్ఎల్ఎస్ డిగ్రీ కాలేజీ జట్టు రెండొవ స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని సాధించింది. తృతీయ స్థానంలో ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు నిలవగా, నాలుగవ స్థానంలో ఆర్‌వీఆర్‌జేసీ జట్టు నిలిచింది. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. టోర్నమెంట్‌లో మెలకువలతో తమ ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్ బాల్ (మెన్) జట్టును సెలక్షన్ కమిటీ సభ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పీ గౌరీశంకర్, డాక్టర్ ఎమ్ శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, ఏఎన్‌యూ సెలక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పీ శ్రీనివాస్, డాక్టర్ ఎం.బుచ్చిబాబు, డాక్టర్ రాజామెరిసిన్ బాబు, జే ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగాది రోజున గాంధేయ మార్గంలో ధర్నా

- వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయూన్ బాషా
- చంద్రబాబు ఎన్నికల హామీలు అమలుచేయాలని డిమాండ్

నరసరావుపేట: జిల్లాలోని వలంటీర్లంతా ఉగాది రోజున (30వ తేదీ)డిమాండ్ల సాధన కోసం ధర్నాకు సిద్ధం కావాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయూన్ బాషా పిలుపు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను జరుపుకునే ఉత్సాహం, ఆసక్తి, సంతోషం వలంటీర్లకు లేకుండా కూటమి నాయకులు చేశారని విమర్శించారు. గతేడాది ఏప్రిల్ 9న ఉగాది నాడు ఎన్‌డీఏ కూటమి పక్షాన చంద్రబాబు నాయుడు వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవస్థను కొనసాగిస్తామని, ఉద్యోగాలు తీసెయ్యమని హామీ ఇచ్చారని తెలిపారు. జీతాన్ని కూడా రూ.10వేలకు పెంచుతామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. నైపుణ్యాలకు పదును పెట్టి, వర్క్‌ఫ్రం హోం జాబ్ చేసేలాగా అవకాశాలిస్తామని ఆశ చూపించారని తెలిపారు.ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంలో రాగానే దూరం పెట్టారని విమర్శించారు. డిమాండ్ల సాధన కోసం వలంటీర్లంతా గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేయాలని బాషా పిలుపు ఇచ్చారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభ తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు జరుగుతాయని సంఘ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్జి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని తెలిపారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జాతీయ మహాసభలకు దేశ నలుమూలల నుంచి ఏఐవైఎఫ్ ప్రతినిధులతోపాటు జాతీయ నాయకత్వం పాల్గొంటుందని పేర్కొన్నారు. యువతను చైతన్యపరచడం, యువతలో సామాజిక స్పృహను పెంచడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యం అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జంగాల చైతన్య,షేక్ వలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన వ్యతిరేక విధానాలను తప్పుబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి అఖిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు ఖాసిం వలి, రెహ్మాన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

పత్తి వ్యాపారి ఆత్మహత్య

ప్రత్తిపాడు: పత్తి వ్యాపారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు నాగిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ పదేళ్లుగా పత్తి కమీషన్ వ్యాపారం చేస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా బామిని మండలం దమ్మిడి జోలా గ్రామ పరిధిలోని రైతుల దగ్గర పత్తిని కమీషన్ వద్దతిన బొమ్మా కొండారెడ్డి అనే అతనికి ఇప్పిస్తుంటాడు. అయితే ఆ పత్తికి సంబంధించిన డబ్బులు, కమీషన్ కలిపి నాగిరెడ్డికి రూ.43 లక్షలు కొండారెడ్డి ఇవ్వాల్సి ఉంది.కొంతకాలంగా రైతులు పత్తి డబ్బులు అడుగుతున్నారని, వారికి సమాధానం చెప్పలేకపోతున్నానని, రైతుల పత్తికి సంబంధించిన డబ్బులు ఇవ్వాలని కొండారెడ్డిని నాగిరెడ్డి అడుగుతున్నాడు. దీంతో తన దగ్గర డబ్బులు లేవని, పదే పదే డబ్బులు అడిగితే కోర్టులో కేసు వేస్తానని కొండారెడ్డితోపాటు ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి నాగిరెడ్డిని బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక మంగళవారం గ్రామంలోని సాగర్ కాలువ పక్కన సమాధుల వద్ద పురుగు మందు తాగి నాగిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు విషయాన్ని అతని భార్య రాజ్యలక్ష్మికి తెలియజేశారు. ఎస్ఐ కె.నాగేంద్ర బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలపై డీఎంహెచ్‌ఓకు వినతి

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా ఉండి ఎంపీహెచ్ఏగా ప్రమోషన్ పొందిన ఏఎన్ఎంల సమస్యలపై బుధవారం ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బోడపాటి నాగవర్ధన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేశారు. శాంక్షన్ పోస్టు ఉండి, ప్రొజిషన్ ఐడీ లేనివాటికి పీఎఫ్ఎంఎస్ దగ్గర జీతాలు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. కాంట్రాక్టు, యూరోపియన్ ఫండ్‌లో పనిచేస్తూ రెగ్యులర్ అయిన ఏఎన్ఎంకు సబ్ సెంటర్ ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని, శాలరీ డ్రాచేసిన చోట కూడా ఖాళీలు చూపించడం వల్ల కొంత మంది ఏఎన్ఎంలు ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదుకు తగు ఉత్తర్వులు ఇచ్చి మెడికల్ డిపార్టుమెంట్ అటెండెంట్స్‌లో నమోదు చేయాలని కోరారు. సబ్ సెంటర్ బిల్డింగ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి హెచ్ఆర్ఏ లేనివారికి హెచ్ఆర్ఏ శాంక్షన్ చేసేవిధంగా చొరవ చూపాలని కోరారు. ఏఎన్ఎంల ప్రమోషన్‌లలో మిగిలిపోయిన ఖాళీలను పరిశీలించి ఇతర సిబ్బందికి కూడా ప్రమోషన్ అవకాశం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ మొహమ్మద్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎం.నరేంద్రబాబు, అంజిరెడ్డి, ఎం.శ్రీనివాస్, ఝాన్సీరాణి, ధనలక్ష్మి, మంగా దేవి, నాగవేణి, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 7,800 గరిష్ఠం : రూ. 9,600

మోడల్ ధర రూ. 8,800

డీ అడిక్షన్ సెంటర్ పరిశీలన



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): మద్యానికి బానిసైన వారికి డీ అడిక్షన్ సెంటర్లో కౌన్సెలింగ్ ఇచ్చి మద్యపానానికి దూరం చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ డాక్టర్లకు సూచించారు. బుధవారం గుంటూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్, గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలోని లేబొరేటరీని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మద్యానికి బానిసైన వారికి క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. అనంతరం లేబొరేటరీని సందర్శించి రోజూ ఎన్ని నమూనాలు తీస్తున్నారని ఆరా తీశారు. కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈఎస్ మారయ్య బాబు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి Smart Economic Display



డా॥ ఉప్పటూరి అంజిత్
MD, DM కార్డియాలజీ (గోల్డ్ మెడలిస్ట్)
ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో ఫెలోషిప్ (AIMS),
FESC, AFSCAI (USA) గారి ఆధ్వర్యంలో
ఉచిత క్లిష్టతర గుండె శస్త్రచికిత్స పరీక్ష శిబిరం
మార్చి 20 నుండి ఏప్రియల్ 20 వరకు
అపాయింట్‌మెంట్ తీసుకున్నవారికి మాత్రమే ECG, కార్డియాలజీ కన్సల్టేషన్ అవసరమైన వారికి ఉచిత యాంజియోగ్రామ్ చేయబడును
క్లిష్టతరమైన గుండె సమస్యలకు అధునాతన పద్ధతుల్లో వైద్యం
ఆధునిక ఇంట్రావ్యాస్కులర్ అల్ట్రాసౌండ్ (IVUS) సహకారంతో ఖచ్చితమైన, క్లిష్టతరమైన గుండె రక్తనాళం స్టంట్‌ల అమరిక
బైపాస్ ఆపరేషన్ తరువాత వచ్చే గుండెపోటు, బ్లాక్స్ ఉంటే గ్రాఫ్ట్ స్టంటింగ్ చేయబడును
ఆపరేషన్ లేకుండా వాల్వ్ మార్పిడి చేయబడును (TAVI)
ANJIO CARE HEART & VASCULAR INSTITUTE
అమృత హాస్పిటల్స్
Old Club Road, Kothapeta, Guntur.
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సదుపాయం కలదు 90 85 86 86 86
NAVAYUGA ADS

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th,ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-సం॥లో) BA, B.Com, BSc, MA, MCom, MBA, MSc(All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ. సంప్ర॥ శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11, బ్రాడీపేట, Gnt. 8555825538

REAL ESTATE

■ గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మస్తాన్ లతీఫ్‌గాడ్. Ph: 9848986831

PLOT FOR SALE

■ విజయవాడకి 32 km అమరావతికి 13km దూరంలో మా joy land వెంచర్ నందు గజం ధర 5000/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 91776 79807

■ హైవే ఫేస్ కమర్షియల్ ప్లాట్స్ అమ్మకం తాడేపల్లి / కొలనుకొండ సర్వీస్ రోడ్ ఫేస్ 920 చ॥గ॥ కియా షోరూం ప్రక్కన / ఇస్కాన్ టెంపుల్ ఎదురు CRDA బిల్డింగ్ పర్మిషన్ కలదు. ✆ 99662 28370

SERVICES

BUSINESS OFFERS

■ హోమ్ లోన్ 48 గంటల్లో పొందండి ! ITR/సాలరీ స్లిప్స్ లేదా? ఎటువంటి సమస్య లేదు! Home First-7406393937

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). 94757 50287

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). 94757 50287

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

■ గుంటూరు అడ్వకేట్ ఆఫీస్ నందు పని చేయుటకు అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. 9553749435, 9515259047

■ అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బీకాం, 2 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ పై పరిజ్ఞానం, రెజ్యూములను hoadvtjobs @gmail.com కు పంపగలరు.

■ Wanted Staff, Nurses and Front Office Staff. Freshers Also can Apply. Ahalya Nursing Home, Behind Kothapeta, Shivalayam, Guntur. 92464 27459

■ నైట్ టైమ్ డ్రైవర్స్ కావలెను. ఆటోమేటిక్ మరియు మాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22262

■ ప్రత్తిపాడులోని ANCI EYE Clinic & Opticals నందు పనిచేయుటకు Lady Diploma Ophthalmologist కావలెను. వివరాలకు సంప్ర॥ 9390809543

■ పొన్నూరు, యడ్లపాడు, గణపవరం పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. 12 గంటల డ్యూటీ మంచిజీతం రూము భోజనం: 9392731748, 6304179046

■ సేల్స్‌మెన్స్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. మమత మెడికల్స్, గుంటూరు. సంప్ర॥ 9849478518, 9346560016

■ Universal కంపెనీకి వర్క్స్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459.

■ ఫ్రీ కంప్యూటర్ హార్డ్‌వేర్ and Networking, MS-Office, Spoken English, కోర్సులలో 3 నెలలో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. ఫ్రీ భోజన-హాస్టల్.ఆ:10th, ITI, Inter, Degree పా/ఫె.Age:18-27Yసంప్ర॥గుంటూరు:9133444985/88/89

■ ఉచితంగా Solar Technician, MS-Office, Spoken English కోర్సులలో 3 నెల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. ఉచిత భోజన & హాస్టల్ వసతి. Q:10th, Inter, B.Tech and above (Pass/Fail) Age: 18-27సం॥ Add : గుంటూరు:9177133358, 9133444989

■ గుంటూరు Bus Stand ఎదురు ఆఫీస్ నందు పనిచేయుటకు టేలీకాలర్స్ కావలెను. Qul:10th-Degree. Salary : 8000-9000.T:9:00AM-6:00PM:9989398775

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ (M/F) కావలెను నైట్ డ్యూటీ చేసేవారికి మొదటి ప్రాధాన్యం. V కార్డియాక్ హాస్పిటల్. 08644-220001, 9492201873

■ పేజీమేకర్, ఫోటోషాప్, మ్యాక్ టైప్ నందు అనుభవం గల లేడీ డి.టి.పి. ఆపరేటర్ కావలెను. మారుతీ నగర్, ఏలూరు రోడ్, విజయవాడ. ✆ 97030 07042

■ Immediate Joining for Ayyappa Agencies Banking Collection Dept (SBI Card), Required Team Leaders & Collection Executives- Prefer to DRA Certificate Candiates Location: Guntur, Vijayawada, Palnadu, Cell: 94949 13910, 8125668677, 8885609229.

■ హైదరాబాద్‌లో బేబీకేర్, పేషెంట్‌కేర్, ఇంటిపని, వంటపని చేయుటకు అర్జెంటుగా స్త్రీలు కావలెను.జీతం:15-30వేలు,రూం మీల్స్‌ఫ్రీ 24/7, 12 Hrs. Ph : 9949782324, 7989204028

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు మ్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ప్రతీతంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.